# నా సాహితీ జీవనంలో జరిగిన కథ

## మల్లాది వెంకట కృష్ణమూర్తి



కేవలం 'కౌముది' పాఠకుల కోసమే మల్లాది గారు మొట్టమొదటి సారిగా వ్రాస్తున్న సంచలనాత్మక శీర్షిక

*1970 నుంచి సాహిత్య మార్గంలో నాకు ఎదురైన అనేక సంఘటనలని, అనుభవాలని పాఠకులతో పంచుకోవడానికి ఈ శీర్షికను ఆరంభిస్తున్నాను. తరచూ నన్ను పాఠకులు అడిగే అనేక ప్రశ్నలకి జవాబులు ఇందులో దొరుకుతాయి. నాకు ఈ మార్గంలో పరిచయం ఉన్న అనేకమంది ప్రముఖుల గురించి రాసే వివిధ విషయాలు, వారితో నా అనుభవాలు చదవడానికి పాఠకులకి ఆసక్తిగా ఉంటాయని విశ్వసిస్తున్నాను. నాకు డైరీ రాసే అలవాటు లేదు కాబట్టి తారీఖులు, నెలలు, సంవత్సరాలు, కొందరి పేర్లు అన్ని సందర్భాల్లోనూ ఇవ్వలేను. అందుకని కేవలం జరిగిన వాటి సారాంశాలని మాత్రమే ఇవ్వగలను. ఎలాంటి దాపరికాలు లేకుండా రాయదలచుకున్నాను కాబట్టి పాఠకులు దీన్ని కల్పితంగా భావించనవసరం లేదు. ఏ విషయం మీదైనా వారు ఇంకాస్త వివరాలు తెలుసుకోడానికి ప్రశ్నలు వేయచ్చు. అలాగే ఏ విషయం మీద తెలుసుకోవాలని ఉందో దాన్ని అడిగితే ఆ వివరాలు రాస్తాను. అయితే ఓ టాపిక్కు ముగిసేదాకా ఆగి దాని మీద నేను చెప్పనివాటి గురించి అడిగితే ఎవరికీ సమయం వృధాకాదు. మీరు టాపిక్కులని సూచించవచ్చు. నేను రాయదలచుకున్న జాబితాలో అవి ఉంటే సరే. లేకపోతే మిగతా పాఠకులకి, నాకు ఈ విషయంలో సహాయం చేసినవారు అవుతారు. అనుమానం ఉన్న సంగతులని వదిలేయదలిచాను కాని అసత్యాలని మాత్రం రాయదలచుకోలేదు. కొందరికి ఇవి బాధని కలిగించవచ్చు. కాని సత్యానికి దగ్గరగా ఉండాలంటే ఇది తప్పదు.* - మల్లాది

> Bad decisions make good stories.
> -Somerset Maugham

# 8

## శ్రీ సి. కనకాంబరరాజు.

1976 లో ఓ ఆదివారం, మధ్యాహ్నం, శ్రీ పాలకోడేటి సత్యన్నారాయణరావు బషీర్‌బాగ్ లోని ఓ ఇరానీ రెస్టారెంట్‌లో టీ తాగుతూండగా, పాలకోడేటి లేచి, అప్పుడే ఆ రెస్టారెంట్ లోకి వచ్చి ఒకతన్ని పలకరించారు. తర్వాత ఆయన్ని నాకు పరిచయం చేసారు.

"వీరు కనకాంబర రాజు గారు ఆంధ్ర పత్రికలో సబ్ ఎడిటర్. అక్కడ మానేసి హైదరాబాద్ వచ్చారు". ఏం మాట్లాడామో గుర్తులేదుకాని, ముగ్గురం బయటికి వచ్చాక ఆయన సైకిల్ మీద వెళ్ళిపోయారు. ఆయన పేరు విభిన్నంగా ఉండటంతో అది గుర్తుండిపోయింది.

1980లో ఓ రోజు ఆంధ్రభూమి వారపత్రిక నుంచి నా పోస్ట్ బాక్స్‌కి ఓ కార్డ్ వచ్చింది. తమ కార్యాలయానికి వచ్చి ఓ సారి తనని కలవమని. దాని ఎడిటర్ శ్రీ కనకాంబర రాజు నుంచి ఆ ఉత్తరం. నేను వెళ్ళదలచుకోలేదు. ఎందుకంటే, ఎడిటర్‌గా ఆయనతో నాకు పూర్వం ఎలాంటి పరిచయం లేదు. పిలవగానే వెళ్ళడానికి నాలోని అహం అడ్డొచ్చింది.

హిప్నాటిస్ట్ నాగరాజు నన్ను అప్పుడప్పుడూ కలుస్తూండేవారు. నాకొచ్చిన ఆ కార్డ్ గురించి చెపితే, వెళ్ళమని ప్రోత్సహించారు. అప్పుడే నా వ్యక్తిగత క్రైసిస్ లోంచి బయటికి వచ్చిన రోజులవి. ఓ కొత్త నవలని అప్పటికే రాసేసాను. ఓ రోజు శ్రీ కనకాంబర రాజు కార్డ్‌లోని ఫోన్ నంబర్‌కి ఫోన్ చేసి మాట్లాడాను. ఆ రోజు సాయంత్రం ఆఫీసయ్యాక వస్తానని చెపితే, 'తప్పక రండి ఎదురు చూస్తూంటాను, ఏదైనా నవలా రెడీగా ఉంటే తెండి" అన్నారు.

సికింద్రాబాద్‌లో సరోజినీ దేవి రోడ్‌లో అజంతా టాకీస్ పక్కనే ఉన్న డెక్కన్ క్రానికల్ కం ఆంధ్రభూమి కార్యాలయానికి వెళ్ళాను. తెల్లరంగు వేసిన ఆ పాత భవంతిలో గ్రౌండ్ ఫ్లోర్‌లో వెనక ఆయన ఆఫీస్ గది ఉంది. నేను వెళ్ళినప్పుడు శ్రీమతి మన్నెం శారద, శ్రీ వీరేంద్రనాథ్, కార్టూనిస్ట్ శ్రీ మల్లిక్, చందు సోంబాబులు అక్కడ ఉన్నారు. వారంతా నాకు అక్కడే పరిచయం - ఒక్క వీరేంద్రనాథ్‌ని వదిలేస్తే. అతనితో పూర్వం నాకు స్వల్ప పరిచయం.

ఆంద్రభూమి వీక్లీకి సీరియల్ రాయమని ఆయన నన్ను కోరడానికి పిలిపించారు. శ్రీ వీరేంద్రనాథ్ సీరియల్ ఒకటి వేస్తున్నామని కూడా చెప్పారు. నేను సిద్ధంగా ఉన్న 'దూరం' నవల స్క్రిప్ఫుని ఇచ్చి చెప్పాను. "ఇది వెరైటీ నవల. కేవలం ఉత్తరాలతో మాత్రమే నవల మొత్తం నడుస్తుంది. రచయిత, అభిమాని మధ్య జరిగే ఉత్తర ప్రత్యుత్తరాల ద్వారా కథని నడిపాను."

మన్నెం శారద ఆ స్క్రిప్ట్‌ని ఆసక్తిగా అందుకుని తిరగేయసాగింది. నాకు ఆశ్చర్యం వేసింది. ఇతరుల స్క్రిప్ట్‌ని అలా చూసే చొరవ ఎడిటర్ ఆమెకి ఇచ్చారా? లేక ఆమె తీసుకున్న చొరవా? అది సభ్యత కాదని కూడా అనిపించింది. సికరాజు - కనకాంబర రాజు కలం పేరు - ఆమెని వారించకపోవడంతో అది ఆయనిచ్చిన చనువే అని అర్థమైంది..

"దీన్ని నిజంగా జరిగిన కథగా పబ్లిసిటీ చేద్దాం. అందువల్ల పాఠకుల్లో ఆసక్తి కలుగుతుంది." సికరాజు చెప్పారు.

నాకు మరోసారి ఆశ్చర్యమేసింది. స్క్రిప్ట్ చదవకుండానే దాన్ని అబద్దంతో సెన్సేషనలిజం చేసే ఆయన ధోరణికి విస్తుపోయాను. ఎందుకంటే గతంలో నాకు పరిచయం ఉన్న దాదాపు అందరు ఎడిటర్స్, సీరియల్స్‌ని చదివి బావుందనుకున్నాకే దాన్ని చాలా సాధారణంగా ప్రచురించేవారు తప్ప ఇలా ఏ నవలకు ఓ ప్రత్యేకతని ఆపాదించేవారు కాదు.

"చిక్కేమిటంటే, ఇది క్లైమాక్స్ దాకా నిజంగా జరిగిన కథే నిజం అని మీరు ప్రకటిస్తే, ఆ అభిమాని చిక్కుల్లో పడొచ్చు" నిజం చెప్పాను.

"ఆ అమ్మాయిది ఏ ఊరు గురూ?" చందు సోంబాబు అడిగాడు.

నేనా ప్రశ్నకి జవాబు చెప్పలేదు.

"మీరు చదివి బావుంటే వేయండి. లేదా తిరిగి ఇవ్వండి. కాపీ పెట్టుకోలేదు." చెప్పాను.

"ఈ వారమే ప్రకటన మొదలుపెడతాను. మీరు రాస్తే బానే ఉంటుంది ఆ ప్రకటన కూడా మీరే చెప్పండి."

ఆయన మాటలకి మరోసారి ఆశ్చర్యపోయాను. చదవకుండా రచయత మీద నమ్మకంతో సీరియల్‌ని ప్రచురించే ఎడిటర్‌ని నేను కలవడం అదే మొదటిసారి.

అప్పటికింకా టీ.విలు ఇళ్ళల్లోకి రాలేదు. ఉన్న ఒక్కటి టీ.వి ఛానెల్ దూరదర్శన్ పందుల పెంపకం లాంటి ప్రజలకి ఏ మాత్రం ఆసక్తి లేని కార్యక్రమాలనే ప్రసారం చేసేది. వార్తలు మినహా ఇంకేమీ దూరదర్శన్‌లో సామాన్యులు చూసేవారు కాదు. ఇంటర్నెట్, ఐపాడ్ లాంటి ఆధునిక వినోద సాధనాలు కూడా లేవు. 1980లలో ఆంధ్రప్రజలకి గల వినోద సాధనాల్లో సినిమా వీక్షణం తర్వాత పుస్తకపఠనమే ప్రధానమైంది. అప్పట్లో వచ్చే వారపత్రికల్లోని రీడింగ్ మెటీరియల్ అంతగా వినోదాత్మకంగా ఉండేది కాదు. చాలా రొటీన్‌గా ఉండేది. సికరాజు దీన్ని బ్రేక్ చేసారు. తమ పత్రిక సర్క్యులేషన్‌ని పెంచుకోడానికి చేసిన కృషికి బై ప్రొడక్ట్‌గా పుస్తక పఠనం మీద ఆసక్తిని, నవలల మీద అనురక్తిని సికరాజు కలిగించారు. ఇందుకు ఆయన ఎవరి సహాయ సలహాలనైనా ఆహ్వానించారు. నచ్చినవి అనుసరించారు. కొందరు పాఠకులు స్వయంగా ఆయన్ని కలిసి సలహాలు చెపితే బావున్నవి స్వీకరించడం ఆ తర్వాత నేను అనేకసార్లు గమనించాను.

"కథంతా ఉత్తరాల ద్వారా సాగుతుంది కాబట్టి స్టాంప్ డిజైన్‌లతో ప్రకటన ఇస్తే బావుంటుంది.." మరి కొన్ని ఐడియాలని కూడా చెప్పాను.

కాగితం మీద నేను చెప్పినవి ఆయన నోట్ చేసుకున్నారు.

"దీని తర్వాత ఇంకో సీరియల్ కూడా మీరు మాకు రాయాలి. కథలు కూడా ఇవ్వండి." కోరారు. సికరాజుని నేను కలిసిన మొదటి మీటింగ్‌లోనే ఆయనేమిటో చాలా భాగం అర్థమైంది. రచయితకి స్వేచ్ఛని ఇచ్చి అతన్నించి పత్రికాభివృద్ధికి ఐడియాలు అడగడానికి చాలా మంది సంపాదకులకి అడ్డువచ్చే అహం ఆయనలో మచ్చుకైనా కనిపించదు. చెప్పిన ఐడియా నచ్చితే, అది ఇతరులకి తనదిగా చెప్పే కుసంస్కారం కూడా ఆయనలో లేదు. ఏదైనా బావుందని ఎవరైనా ప్రశంశిస్తే ఆ ఐడియా ఎవరిచ్చారో దాచకుండా చెప్పేసేవారు. ఈ విధమైన ఆయన స్వభావం వల్ల ఆయనకో 'థింక్ బాంక్' అనుకోకుండా లభించింది. ' రచయితతో ముఖాముఖి' శీర్షికని శ్రీ వీరేంద్రనాథ్ సూచించిందే. పాఠకులు సీరియల్ రాసే రచయితని అడిగే ప్రశ్నలకి పత్రికా ముఖంగా ఆ రచయిత సమాధానం చెప్పే ఈ శీర్షిక రచయితలు తమ పాఠకుల ముందు, తమ ఇమేజ్‌ని పెంచుకునేందుకు దోహదపడింది. శ్రీ వీరేంద్రనాథ్ ఇచ్చే సమాధానాలు తమ ఇమేజ్ పెంచుకునేలా ఉండడాన్ని నేను పసిగట్టాను. వీరేంద్రనాథ్‌కి స్వంత కారుందని, స్కాచ్ విస్కీ తీసుకుంటారని, విమానాల్లో ప్రయాణిస్తారని.. ఇలాంటివి, తను గొప్పలు చెపుతున్నారనే అభిప్రాయం కలగకుండా సమాధానాల్లో చొప్పించేవారు. దీన్ని నాతో సహా మిగిలిన రచయితలు కూడా మాకు వీలైన పద్ధతిలో కాపీ కొట్టాం.

పూర్వం ఏ పత్రికలో ఇలాంటి ప్రక్రియ రాలేదు.

అలాగే రచయిత ఫోటోలని ముఖాముఖి శీర్షికలో వారం వారం ప్రచురించడం కూడా వ్యక్తిగతంగా పబ్లిసిటీ అంటే ఆసక్తిగల శ్రీ వీరేంద్రనాథ్ ఐడియానే.

ఓసారి 'మల్లాది వెంకట కృష్ణమూర్తి, హైదరాబాద్' అన్న చిరునామా గల పోస్ట్ కార్డ్ నాకు డెలివరి అయింది. ఆ సంగతి మాటల్లో సికరాజుతో చెపితే, దాన్ని పత్రికలో ప్రచురించి, ఆ సంగతి పాఠకులకి తెలియచేసారు. ఇలా తన పత్రికకి రాసే రచయితల

ఇమేజ్‌ని పెంచడం ద్వారా వారి రచనలని పాఠకులు హీరో వర్షిప్‌తో చదువుతారని నమ్మి సికరాజు రచయితలకి ఆ విధమైన గౌరవాన్ని తెచ్చిపెట్టారు.

ఇది ఆనాటి సాంప్రదాయ సంపాదకత్వానికి పూర్తిగా విభిన్నమైన ప్రక్రియ. అంతదాకా రచయిత కన్నా సంపాదకుడు పై మెట్టువాడు అనే ధోరణితోనే వివిధ దిన, వార, మాస పత్రికల సంపాదకులు పనిచేసేవారు. ఈ కొత్త ధోరణిని ఇతర సంపాదకులు చాలా కాలం జీర్ణించుకోలేకపోయారు. సికరాజు చేసేది తప్పని భావించేవారు. కాని క్రమేపీ పాఠకులు పెరిగి ఆంధ్రభూమి సర్క్యులేషన్ పెరగసాగింది. ఆ విధంగా సికరాజు కొంత కాలంగా పత్రిక సర్క్యులేషన్‌ని పెంచడానికి చేసిన వివిధ ప్రయోగాలతో చివరికి విజయవంతమైన ప్రయోగాన్ని కనుగొన్నారు. అది ఆయనతోనే అంతం అవడానికి కారణం ఆయన పని ఎవరికీ స్పష్టంగా తెలియకపోవడమే.

సికరాజులో దాపరికం తక్కువ. ఆయన పెరిగే సర్క్యులేషన్ ఫిగర్స్ మా రచయితలందరికీ ఆనందంగా చెప్పేవారు. వీరేంద్రనాథ్ సీరియల్‌కి, నా సీరియల్‌కి మిగిలినవారి సీరియల్స్ కంటే అధిక రెస్పాన్స్ రావడాన్ని గమనించాక సికరాజు మమ్మల్ని వదులుకోదల్చుకోలేదు. ‘దూరం‘ పూర్తయ్యే సమయంలో దాన్ని పెంచమన్నారు. అందాక దాని ఇతివృత్తంలో అవకాశం లేదంటే, వెంటనే ఇంకో సీరియల్ రాయమని నన్ను కోరారు. లేకపోతే, కొంతమేర సర్క్యులేషన్ దెబ్బ తింటుందని ఆయన భయం. అయితే నేను కొత్త సీరియల్ రాసి సిద్ధంగా ఉంచలేదు. "ఫర్వాలేదు. వారం వారం రాసివ్వండి" ఆయన నన్ను కోరారు.

ఇది నాకు ఆశ్చర్యం కలిగించిన మరో విషయం. అంతదాకా ఏ పత్రికైనా తమకి వచ్చిన నవలలు మొత్తం చదివి, అందులో బావున్నవే వేసుకోవడం తప్ప ఇలా వారం వారం అడిగి రాయించుకునే పద్ధతి లేదు. ఒక్క శ్రీమతి సులోచనారాణి మాత్రం ఇలా రాసేవారని విన్నాను. తెలుగు వారి చేత నవలలని సీరియల్‌గా, ఆసక్తిగా చదివించిన కోడూరి కౌసల్యాదేవి కూడా మొత్తం నవల పంపితే కాని ఆంధ్రప్రభ వారపత్రికలో ప్రచురించేవారు కాదు.

నేను అల్లుకున్న ఓ ఇతివృత్తాన్ని చెపితే ‘బావుంది రాయండి‘ అని ప్రకటనని సికరాజు నా చేతే తయారు చేయించారు. ‘పెద్దలకు మాత్రమే‘ అనే నా రెండో సీరియల్ అలా ఆంధ్రభూమి వారపత్రికలో వెలువడింది. ఆ సీరియల్ పాఠకులని బాగా ఆకట్టుకుంది. అది సాంప్రదాయ నవలా ఇతివృత్తానికి విభిన్నమైన శృంగార, సస్పెన్స్ నవల. దాన్ని వివిధ ప్రకటనలు, పద్ధతులతో సికరాజు చక్కగా పాఠకులకి ప్రాజెక్ట్ చేసారు. ఓ గ్రీటింగ్ కార్డ్ లోని బొమ్మని చూసి నేను దాన్ని సికరాజుకి ఇస్తే ఆర్టిస్ట్ త్రిగుణ్‌ని పిలిచి దాన్ని ‘పెద్దలకు మాత్రమే‘ సీరియల్ లోగోకి వాడమని నా ముందే పురమాయించారు. ఆ రోజుల్లో వారపత్రికలు సాధారణంగా పద్దెనిమిది వారాలు మించి సీరియల్‌ని ప్రచురించేవారు కాదు. కాబట్టి నేను కూడా పద్దెనిమిది వారాల సీరియల్ ని ప్లాన్ చేసుకున్నాను. పధ్నాలుగో వారంలో ‘సీరియల్ రెస్పాన్స్ బావుంది. దాన్ని పద్దెనిమిది వారాలకి ముగించకుండా, మరో ఐదారువారాలు పెంచండి‘ ఆయన నన్ను కోరారు. ఆ నవలని పెంచేందుకు వెసులుబాటు ఉండటంతో దాన్ని నేను ఇరవై నాలుగు వారాలు రాసాను.

శ్రీ వీరేంద్రనాథ్ రాసిన ఓ నవల పేరు ‘పెద్దలకు మాత్రమే.‘. దాన్ని సికరాజుకి ఇస్తే ఆయన వెంటనే దాన్ని ప్రచురించలేదు. కొన్ని నెలల తర్వాత ‘దూరం‘తో పాటు ఆ సీరియల్‌ని సికరాజు ప్రచురించారు. దాని పేరు ‘తులసి దళం‘గా ఆయన మార్చారు. ఈ సంగతి శ్రీ వీరేంద్రనాథ్ నా రెండో సీరియల్ ‘పెద్దలకు మాత్రమే‘ ప్రకటన చూసాక నాకు చెప్పారు.




ఆంధ్రభూమి వీక్లీ సర్క్యులేషన్ ఆంధ్రాలో కంటే తెలంగాణాలో అధికంగా ఉండేది. బాణామతి, చేతబడుల మీద తెలంగాణాలో నమ్మకం ఎక్కువగా ఉండేది. కాబట్టి తెలంగాణా జిల్లాల ప్రజల నుంచి ఆ సీరియల్‌కి రెస్పాన్స్ బాగా వచ్చింది. మిగిలిన జిల్లాల పాఠకులు శ్రీ వీరేంద్రనాథ్ పెంపొందించుకునే ఇమేజ్ వల్ల ఆ సీరియల్‌ని చదివేవారు. చక్కటి బిగింపుతో, సెంటిమెంట్‌తో సాగిన వినూత్న నవల అవడం వల్ల రచయితగా సమర్ధుడు అవడం వల్ల క్రమేపీ ఇతర పాఠకులు కూడా తులసి దళాన్ని, దానిలోని దమ్మువల్ల బాగా చదవసాగారు.

నన్ను 'దూరం' నవల పెంచమన్నట్లుగానే వీరేంద్రనాథ్‌ని కూడా తులసి దళాన్ని పెంచమని సికరాజు కోరారు. మొదట వీరేంద్రనాథ్ పూర్తిగా ఇచ్చిన నవల నిడివికంటే, ప్రచురింపబడ్డ నవల నిడివి రెట్టింపు ఉండచ్చు.

'పెద్దలకు మాత్రమే' పెంచమన్నప్పుడే ఇంకో నవలని సీరియల్‌గా రాయమని సికరాజు నన్ను కోరారు. 'ఈ గంట గడిస్తే చాలు' అనే సీరియల్ ఇతివృత్తాన్ని చెపితే, దాన్ని ఓకే చేసారు. అప్పటికే పాఠకుల పల్స్‌ని తెలుసుకున్న రచయితగా నన్ను ఆయన గుర్తించారు. కాబట్టి నేను ఏం రాసినా వేయడానికి ఆయన సిద్ధంగా ఉన్నారు. ఇదే నా అభిప్రాయం. శ్రీ వీరేంద్రనాథ్ మీద కూడా ఆయనకి ఉంది. మిగిలిన రచయితలకి మాకిచ్చిన స్వతంత్రమే ఇచ్చినా పాఠకులని అమితంగా ఆకట్టుకునేలా వారు రాయలేకపోవడంతో మా ఇద్దర్నే సికరాజు ప్రధాన సీరియల్ రైటర్స్‌గా భావించసాగారు.

శ్రీ వీరేంద్రనాథ్‌ది క్రియేటివ్ బ్రెయినే కాక, కమర్షియల్ బ్రెయిన్ కూడా. పత్రిక సర్క్యులేషన్ పెరగడం, దానివల్ల పెరిగే లాభం మొదలైనవి లెక్కకట్టి తన పారితోషికాన్ని పెంచమని కనకాంబర రాజుతో ఆయన మాట్లాడారు. ఆ విషయంలో నన్ను కూడా కలుపుకున్నారు. ఇద్దరం అడిగితే ఫోర్స్ ఉంటుందని ఆయన భావించి ఉండచ్చు. అయితే శ్రీ వీరేంద్రనాథ్ తత్వం ఏదీ సూటిగా, స్పష్టంగా చెప్పకపోవడం అని నా అబ్జర్వేషన్. ఆ విషయం నాకు చూచాయగా చెప్పారు. ఆయన చెప్పక మునుపు నాకు ఈ కేలిక్యులేషన్స్ తెలియవు. 'ఆయనకి ఎంతిస్తే, నాకూ అంతే ఇవ్వాలి' అని మాత్రమే సికరాజుతో చెప్పాను. వారు మేనేజ్ మెంట్‌తో మాట్లాడి మా ఇద్దరి పారితోషికాన్ని పెంచారు. ఆనాటి మిగిలిన వారపత్రికల యాజమాన్యం సాధారణంగా సంపాదకులు కోరినా రచయితల పారితోషికం పెంచేది కాదు. యాజమాన్యం సంపాదకులని దాదాపు గుమాస్తాలుగా భావించేవారని ఇంటలెక్చువల్స్‌గా ట్రీట్ చేసేవారు కాదు. వారి మాటలకి పెద్ద విలువనిచ్చేవారే కాదు. కాని ఆంధ్రభూమి యాజమాన్యం అలా కాదు అని చరిత్ర ఋజువు చేసింది. చాలాకాలంగా వస్తున్న మూడు వారపత్రికల సర్క్యులేషన్‌ని అధిగమించేస్థాయిలో భూమి వీక్లీ ఎదుగుతోంది కాబట్టి మా పారితోషికం పెంచడానికి యం.డి. శ్రీ చంద్రశేఖర రెడ్డి అంగీకరించారు.

జరుగుతున్నది పసికట్టిన ఆంధ్రజ్యోతి వీక్లీ ఎడిటర్ శ్రీ పురాణం సుబ్రమణ్యశర్మ, వీరేంద్రనాథ్‌ని నన్ను కాంటాక్ట్ చేసి, తమ వీక్లీలో కమర్షియల్ సీరియల్స్ రాయాల్సిందిగా కోరారు. వీరేంద్రనాథ్ ఆయనతో పారితోషికం గురించి ప్రస్తావిస్తే సికరాజులా ఆ బాధ్యతలు మీద పెట్టుకున్నా కుదరదని ఈ వ్యవహారాలు చూసే శ్రీ కె.ఎల్.ఎన్.ప్రసాద్ కొడుకు జగదీష్ ప్రసాద్, శ్రీ పురాణం మాట మీదే కాక, సర్క్యులేషన్ మేనేజర్ శ్రీ వెంకటేశ్వరరావు అభిప్రాయం కూడా తీసుకుని మాకు పారితోషికం పెంచడానికి ఆయన ఒప్పుకున్నారు. 'రెండు రెళ్ళు ఆరు' అనే నా సీరియల్ ప్రకటన ఆంధ్రజ్యోతిలో చూడగానే కనకాంబరరాజుకి నా మీద కోపం వచ్చింది. ఆ పత్రికలో రాస్తే పాఠకులు అటువైపు మొగ్గుతారు అని భయపడ్డారు. అది కామిడీ సీరియలేనని, 'ఈ గంట గడిస్తే చాలు'లా సస్పెన్స్ గల క్రైం నవల కాదని ఆయనకి సర్ది చెప్పాను. నేను రాసే రెండు సీరియల్స్ ఒకేసారి భూమిలో వేయరు కాబట్టి ఇంకో పత్రికలో

రాయడానికి అభ్యంతరం ఉండకూడదని కూడా గట్టిగా చెప్పాను. ఆశ్చర్యంగా ఆయన ఈసారి రెండు సీరియల్స్ నావే వేద్దామని నిశ్చయించారు.

అప్పటికే నన్ను సికరాజుకి దూరంగా ఉంచడానికి కొన్ని ప్రయత్నాలు జరగడం మొదలయ్యాయి. ఆ కారణంగా అనుకుంటా, ఆ వినూత్న ప్రక్రియ ద్వారా పాఠకులకి నా మీద రచయితగా మరింత అభిమానం కలగకుండా ఉండడానికి ఆ ప్రయత్నాన్ని ఆ వ్యక్తులు భగ్నం చేయగలిగారు.

ఓ ఏప్రిల్ ఒకటో తారీకు సంచికకు సికరాజు డమ్మీ వేస్తూండగా సాయంత్రం ఆయన దగ్గరకి వెళ్ళాను. పాఠకులని ఏప్రిల్ ఫూల్ చేసే ఐడియా గురించి చర్చ జరుగుతోంది. దినపత్రికలో ఏప్రిల్ ఒకటిన నిజం అనిపించే రాజకీయ వార్తని ఇచ్చి, చివర్లో అది నిజం కాదని, ఏప్రిల్ ఫూల్ అని చెప్పడం జరుగుతూండేది. ఆ పద్ధతిలో ముఖచిత్రం ఏ ప్రకటన ఇచ్చి, లోపల పేజీల్లో ఏప్రిల్ ఫూల్ అని ఇవ్వాలా అన్న విషయాన్ని ఆలోచిస్తున్నారు. 'ముఖచిత్రం మీద మల్లాది ఫోటో ఫలానా పేజీలో అని ఇస్తే, అంతదాకా నా ఫోటో రాలేదు కాబట్టి లోపల 'ఏప్రిల్ ఫూల్' అని ఇవ్వొచ్చు' అని నన్ను చూసి కార్టూనిస్ట్ మల్లిక్ సూచించారు.

అది నాకు ఇష్టం లేదు. పాఠకులని అలా ఫూల్ చేస్తే, వారికి నామీద కోపం రావచ్చనే భయం కలిగింది. ఆ మాటే చెప్పాను. కొద్దిసేపు చర్చించాక నాకు అకస్మాత్తుగా తట్టిన ఆలోచనని చెప్పాను. పత్రిక ముఖచిత్రం పేజీ తిప్పగానే 'ఏప్రిల్ ఫూల్. ఇది ఆఖరి పేజీ. వెనక్కి తిప్పి మొదటి పేజీనుంచి చదవండి' అని ఇస్తే ఎలా ఉంటుందని అడిగాను. అట్టని తలకిందులుగా బైండ్ చేయడం ఆఖరు పేజీని తలక్రిందులుగా ముద్రించడం ఇందుకోసం చేయాలి. వెంటనే సర్క్యులేషన్ మేనేజర్ శ్రీ శేషగిరిరావుని పిలిపించి సికరాజు ఈ విషయం చెపితే, మార్కెటింగ్ సెక్షన్‌కి ఇది అభ్యంతరం ఉండదని, అలా చేయవచ్చని ఆయన ఆనందంగా ఒప్పుకున్నారు. ఆయన తరచు సికరాజు గదికి వచ్చి కూర్చుని మాతో మాట్లాడేవారు. రచయితలుగా వీరేంద్రనాథ్‌కి, నాకు ఉన్న ఇమేజ్ గురించి, తమకి హాకర్స్ (పత్రికలు అమ్మేవారు) ద్వారా వచ్చే ఫీడ్ బేక్ గురించి మాకు చెప్పేవారు.

ఒకటి రెండుసార్లు ఇద్దరు ముగ్గురు పెద్ద పత్రికా ఏజెంట్లు నన్ను, వీరేంద్రనాథ్‌ని చూడాలనే కోరికని శ్రీ శేషగిరిరావుకి చెపితే ఆయన వారిని సికరాజు ఆఫీసుకు తీసుకువచ్చి మమ్మల్ని పరిచయం చేసారు. ఇలాంటి ఏజెంట్స్ ఆంధ్రజ్యోతి సర్క్యులేషన్ మేనేజర్‌కి మా సీరియల్స్ వేయమని సూచించడం తద్వారా శ్రీ జగదీష్ ప్రసాద్ మా పారితోషికం పెంచడం జరిగాయని వారి ద్వారా తెలిసింది.

శ్రీ సికరాజు ఎప్పుడూ 'పత్రికలో కొత్తగా ఏం చేద్దాం?' అని మా ఇద్దరినీ అడిగేవారు. సికరాజుకి, వీరేంద్రనాథ్ మీద, నా మీద రచయితలుగా గురి, తమ మీద లేకపోవడంతో భూమి వీక్లీకి రాసే ఇతర రచయితలు ఉత్సాహంగా ఐడియాలు చెప్పడానికి ముందుకి వచ్చేవారు కాదు. మల్లిక్ మాత్రం ఐడియాలు చెప్పేవారు. ఆయన అందరి మా అందరికన్నా సికరాజుకి క్లోజ్. చివరిదాకా ఆయన సికరాజుని వదల్లేదు. ఓ పాఠకుడినుంచి వచ్చిన ఉత్తరం ద్వారా అనుకుంటా నా ఫోటో చూడని పాఠకులకి ముఖాముఖిని నాతో రికార్డ్ చేసి కాసెట్స్ ద్వారా అందచేస్తే బావుంటుందనే ఆలోచన కలిగింది. దానిమీద చర్చించాక అలాంటి కేసెట్‌ని రికార్డ్ చేసి ఓ పోటీలో గెలుపొందిన పాఠకులకి గిఫ్ట్‌గా పంపారు. తరచూ కనకాంబరరాజు దగ్గరికి వచ్చే, ఆలిండియా రేడియోలో పనిచేసే శ్రీ జీడిగుంట రామచంద్ర మూర్తి, ఆల్ ఇండియా రేడియోలో తన కొలీగ్ గా పనిచేసే శ్రీమతి జ్యోత్స్న ఇలియాస్‌ని నన్ను ప్రశ్నలు అడిగేందుకు ఒప్పించారు. కొన్ని ప్రశ్నలు ముందే అనుకుని, బషీర్‌బాగ్‌లోని ఓ రికార్డింగ్ స్టూడియోలో ఆ కార్యక్రమాన్ని రికార్డ్ చేసారు. ఆంధ్రభూమి యాజమాన్యం, పెరుగుతున్న భూమి సర్క్యులేషన్ దృష్ట్యా ఇలాంటి అదనపు ఖర్చులకి అభ్యంతరం చెప్పేవారు కాదు. భూమి వీక్లీలో రికార్డింగ్ జరుగుతున్న ఫోటోని నా ముఖాముఖితోపాటు ప్రచురించాలి. అన్ని ఫోటోల్లో నేనున్నాను. ఎట్టి పరిస్థితుల్లో నా ఫోటో వద్దని, నన్ను అవాయిడ్ చేసి తీయమని రికార్డింగ్ టైంలో కోరినా, నన్ను ఒప్పించవచ్చని సికరాజు అనుకున్నారు. నన్ను ఫోటోకి ఒప్పించడానికి

దాదాపు గంట సేపు ఆయన ప్రయత్నించారు. 'ఏమనుకుంటున్నారు? మీ ఫోటో పడకపోతే, మీకు బొల్లి ఉందనో, ముఖం కాలిందనో, మచ్చలున్నాయనో ఇప్పటికే పాఠకులు అనుకుంటున్నారు. మీ ఫోటోరావడానికి ఇది ప్రత్యేక అవకాశం' అని కోపంగా చెప్పారు.



నేను ససేమిరా అన్నాను.

"మీరు ఒప్పుకుంటారనే ఫోటోలు తీయించాను. ఇప్పుడు మీరు కాదంటే శ్రీమతి జ్యోత్స్న గారి ఒక్క ఫోటో ఎలా వేయను? ఆవిడ ఎవర్ని ఇంటర్వ్యూ చేస్తున్నట్లు?" కోపంగా అడిగారు.

చివరికి నా ఫోటో అవుట్ లైన్ నల్లగీతలో ఉంచి, లోపల తెల్ల రంగు వేయవచ్చని ఎవరో సూచించారు. బహుశా పాలంకి సత్య అనుకుంటా, లేదా సికరాజుని తరచూ కలిసే అలాంటి రచయితల్లో, మా చర్చ విన్న ఎవరో.

నాకు అది కూడా ఇష్టంలేకపోయింది. కాని తప్పలేదు. నేను ఫోటో వేయించుకోననే ప్రకటనగా దాన్ని పాఠకులు భావించవచ్చని, కొందరు పాఠకులు ఫోటో వేయకపోతే బానే ఉంది కాని అసలెందుకీ అవుట్ లైన్ అని ఫీలవుతారని నాకది ఇష్టంలేకపోయింది. కాని తప్పలేదు.



నా కొచ్చిన మరో ఆలోచనని 'ఈ గంట గడిస్తే చాలు' మొదలయ్యే ముందు చెప్పాను. సీరియల్ మొదటి పేరా నా చేతి రాతతో మొదలు పెట్టి, మిగతాది కంపోజ్ చెయ్యడం. ఆయన 'నో' చెప్పలేదు. ముగింపు ఇన్‌స్టాల్‌మెంట్ ఇచ్చాక నా చేతి రాతతో మొదలైంది కాబట్టి శ్రీ జంధ్యాల చేతిరాతతో ముగిస్తే బావుంటుందని సూచించాను. ఆయన దానికీ ఒప్పుకుని, మద్రాస్‌లోని తమ సినిమా విలేకరికి ఆఖరి పేజీని పంపి జంధ్యాలగారి చేత రాయించిన స్క్రిప్ట్ తెప్పించి దాన్ని ప్రచురించారు. అప్పటికింకా జంధ్యాల నేను కలిసి పనిచేయటం మొదలు కాలేదు.



సికరాజులో స్నేహ భావం ఎక్కువ. ఎక్కడికైనా వెళితే వెంట రచయితలని తీసుకెళ్ళేవారు. భాస్కరన్ అనే ఓ తమిళియన్ బ్రహ్మచారి ఆయన్ని ఓ రాత్రి భోజనానికి పిలిచారు. వారిద్దరికీ ఎలా పరిచయమో గుర్తులేదు. వారింటికి నన్నూ తీసుకెళ్ళారు. ఆయన ఆల్సేషియన్ కుక్కల్ని పెంచేవారు. కుక్కల గురించి అడిగితే చాలా విశేషాలు ఆ మందుపార్టీలో చెప్పారు. అప్పుడు ధర్మయుద్ధం అనే సీరియల్‌ని ఆంధ్రభూమిలో రాస్తున్నాను. కుక్కల గురించి ఆయన చెప్పిన సమాచారంతో నవల్లో, హీరో అలాంటి ఆల్సేషియన్ డాగ్ నుంచి తప్పించుకునే సన్నివేశం సృష్టించాను.

ఇలాంటివి గమనించాకే సికరాజుకి నా మీద సమర్ధుడైన ఫ్లెక్సిబిలిటీ గల రచయిత నన్న నమ్మకం కలిగింది.

మొదటి నుంచీ నాకు కథలు రాయడం ఇష్టం. సికరాజుతో చనువు ఏర్పడ్డాక కొసమెరుపుతో పూర్తయ్యే మినీ కథలు వారం వారం రాస్తానని కోరాను. ఆయన ఉత్సాహంగా ఒప్పుకుని ఏదైనా శీర్షికతో రాస్తే బావుంటుందని చెప్పారు. 'కథాకళి' అనే పేరుని ఆయనే దానికి పెట్టారు. చాలా ఏళ్ళు భూమి వీక్లీలో సాగిన ఆ శీర్షిక అనేక మంది పాఠకులకి నచ్చింది. ఇప్పటికీ ఆ నాటి పాఠకులు ఫలానా కథ బావుంది అని కథ గురించి గుర్తుచేస్తూంటారు. 'కథాకేళి' పేరుతో ఇది పుస్తకంగా కూడా వెలువడింది.

ఓ రోజు బార్లలో జరిగే తమాషా అనుభవాల మీద కూడా కొద్దికాలం ఓ శీర్షికని భూమిలో రాసాను. దాన్ని గురించి సికరాజుకి వివరించినప్పుడు తగిన పేరు గురించి ఆలోచిస్తూంటే, అక్కడే ఉన్న శ్రీ యండమూరి వీరేంద్ర నాథ్ 'బార్.ఎట్.లాఫ్' ని సూచించారు. అందరికీ నచ్చింది. అదే ఆ శీర్షిక పేరుగా కొంతకాలం రాసాను.

సినిమా పత్రిక అనే వారపత్రికని కూడా ఆయన ఆరంభించారు. దానికీ సికరాజే ఎడిటర్. దాంట్లో కూడా 'సత్యాదేవి' అనే కలం పేరుతో హాలీవుడ్ చిత్రాలకి సంబంధించిన విశేషాలని, హాలీవుడ్ పత్రికలనుంచి సేకరించి రాసేవాడిని.

1981లో దూరం, పెద్దలకు మాత్రమే లు, 1982 లో ఈ గంట గడిస్తే చాలు, 1984లో ధర్మయుద్ధం, ది అపార్ట్‌మెంట్ సీరియల్స్ నావి వెలువడ్డాయి. ది అపార్ట్ మెంట్ మాత్రం మధ్యలోనే ఆపేసాను. కారణం అది కొనసాగితే కోర్టుకేసు ఎదుర్కోవాల్సిన పరిస్థితి రావడం. అందువల్ల సికరాజు దాన్ని ఆపేద్దామనే చెప్పారు.

ఓ రోజు శ్రీ సికరాజు అర్జెంటుగా వచ్చి కలవమని ఆఫీస్‌కి ఫోన్ చేసారు. సాయంత్రం ఆఫీస్ నుంచి వెళ్ళి ఆయన్ని కలిసాను.

*(మిగిలిన విశేషాలు వచ్చేనెల)*

**NEW**
Click here to share your comments on this story

# ఒక జ్ఞాపకం

## డా.వై.రామకృష్ణారావు

కౌముది సంపాదకులకు నమస్తే!

నవంబరు సంచికలో శ్రీ మల్లాది వెంకటకృష్ణమూర్తి గారి 'నా సాహితీ జీవనంలో జరిగిన కథ' చదివిన తర్వాత ఒకసారి నా గతానుభవం కళ్ళముందు మెదిలింది. ఈ నాడు సంస్థ వారి విపుల, చతుర పత్రిక సంపాదకులు శ్రీ చలసాని ప్రసాదరావు గారి వద్ద సబ్ ఎడిటర్లుగా పనిచేసిన వారిని ప్రస్తావిస్తూ కె.బి.లక్ష్మి, బుర్రా సుబ్రహ్మణ్యం, రామకృష్ణారావుల పేర్లను పేర్కొన్నారు. ఆ రామకృష్ణారావుని నేనే. 1976 నుంచి 1979 వరకు నేను ఈనాడు ఆదివారం, విపుల, చతురలకు సబ్ ఎడిటర్ గా పనిచేశాను. ఈనాడు ఆదివారం అనుబంధానికి ప్రధానంగా బుర్రా సుబ్రహ్మణ్యం పనిచేస్తుంటే, తరువాత చేరిన నేను మొదట్లో అతనికి తోడుగా ఉండేవాడ్ని. ఆ తరువాత విపుల, చతురలు ప్రారంభమయ్యాయి. ఆ రెండు మాసపత్రికలను నేను చూసేవాడిని. పని ఎక్కువగా వడం వల్ల విపులను నాకప్పగించి, చతురను చొక్కాపు వెంకటరమణకు అప్పగించారు. ఆ కాలంలో మల్లాది వెంకటకృష్ణమూర్తి గారితో పరిచయం ఏర్పడింది. ఆయన చిన్నచిన్న కాగితాల స్లిప్పుల మీద పుంఖానుపుంఖాలుగా ఆసక్తికరమైన ఆర్టికల్స్ రాసిచ్చేవారు. అయితే ఆయన దస్తూరీ చాలా ఘోరంగా ఉండేది. మాకు ఒక పట్టాన కొరుకుడు పడేది కాదు. ఆయన రచనల్ని ఎడిట్ చేసి, శుద్ధప్రతి రాసి ప్రింటుకు ఇవ్వడానికి చాలా ఇబ్బంది

పడాల్సి వచ్చేది. చివరికి మా ఎడిటర్ చలసాని ప్రసాదరావు గారికి మేమంతాఫిర్యాదు చేశాం. ఆయన మల్లాది వారికి " మా సబ్ ఎడిటర్లు మీ దస్తూరి వల్ల ఇబ్బంది పడుతున్నారు" అని తెలియచేశారు. అందుకు, అంత గొప్ప, పాప్యులర్,బిజీ రచయిత ఐన మల్లాది వెంకటకృష్ణమూర్తి గారు నొచ్చుకోలేదు, కోపగించలేదు. "నా దస్తూరీ బాగా లేనందుకు సిగ్గు పడుతున్నాను. ఇక నుంచి వేరే వారితో చక్కగా కాపీచేయించి పంపిస్తాను" అని లెటర్ రాశారు. హిమాలయమంత రచయిత మల్లాది వెంకటకృష్ణమూర్తి గారు. ఎంతో నిరాడంబరుడు. నిగర్వి. నేను ఈనాడు వదిలిపెట్టి లెక్చరర్ గా చేరాక నా రీసెర్చికి సబంధించి, ఇతరత్రానూ, హైదరాబాదులోని గాంధీనగర్ లోని వారింటికి వెళ్తుండేవాడిని. ఆయన ఆత్మీయత మరువలేనిది. గొప్ప స్నేహశీలి.